సాక్షి విశాఖపట్నం

గురువారం । 13 । జూలై । 2023



'పెర్ఫార్మెన్స్' టాప్

విద్యా కార్యక్రమాల అమల్లో రాష్ట్రంలో ఉమ్మడి విశాఖ జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. 8లో



ఆపరేషన్ థియేటర్ ప్రారంభం

రైల్వే హాస్పిటల్‌లో ఆధునిక సౌకర్యాలతో ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్‌ను డీఆర్‌ఎం అనూప్‌కుమార్ ప్రారంభించారు. 8లో

లారీని ఢీకొన్న కారు



జాతీయ రహదారిపై దేవరం సమీపంలో ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టడంతో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. 8లో

న్యూస్‌రీల్

ఏడుగురు సీఐలకు స్థానచలనం



దొండపర్తి: నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏడుగురు ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కలిగింది. ఇందులో ఇద్దరిని రేంజ్‌కు సరెండర్ చేస్తూ పోలీస్ కమిషనర్ **డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ** బుధవారం **ఉత్తర్వులు జారీ** చేశారు. నార్త్ ట్రాఫిక్ సర్కిల్ **సీఐగా ఉన్న** ఎస్.సాయిని కంచరపాలెం లా **అండ్ ఆర్డర్‌కు,** నార్త్ సబ్ డివిజన్ క్రైం సీఐ డి.ర**మేష్‌ను భీమిలి** లా అండ్ ఆర్డర్‌కు, వెస్ట్ సబ్ డి**విజన్ క్రైం సీఐ** కె.దుర్గాప్రసాద్‌ను సీఎస్‌బీ-2**కు, వీఆర్‌లో** ఉన్న జి.డి.బాబును మల్కాపుర**ం లా అండ్** ఆర్డర్‌కు బదిలీ చేశారు. అలాగే కంచరపాలెం లా అండ్ ఆర్డర్ సీఐ ఎస్.విజయ్‌కుమార్‌ను సిటీ వీఆర్‌కు పంపించారు. పెందుర్తి లా అండ్ ఆర్డర్‌కు అటాచ్‌మెంట్‌లో ఉన్న సీఐ జి.అప్పారావును, భీమిలి లా అండ్ ఆర్డర్ కె.లక్ష్మణమూర్తిని విశాఖ రేంజ్‌కు సరెండర్ చేశారు.

18 నుంచి దూరవిద్య పరీక్షలు



ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం నిర్వహిస్తున్న యూజీ, పీజీ, ప్రొఫెషనల్ కోర్సులు, డిప్లమా ఇన్ మ్యూజిక్, పీజీ డిప్లమా, సర్టిఫికెట్ కోర్సుల మొదటి సంవత్సరం పరీక్షలను ఈ నెల 18 నుంచి నిర్వహించనున్నట్టు సంచాలకులు ఆచార్య కె.విశ్వేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 74 కేంద్రాల్లో జరిగే ఈ పరీక్షల కోసం 27 వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేశారని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల్లో కొన్ని మార్పులు చేశామని, విద్యార్థులు గమనించాలని సూచించారు. పూర్తి వివరాలకు ఏయూ దూరవిద్య వెబ్‌సైట్ https://www.andhrauniversity&sde.com నుంచి పొందాలన్నారు. విద్యార్థులు తమ హాల్ టికెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని నేరుగా పరీక్షకు హాజరు కావాలన్నారు.

స్థాయీ సంఘ నామినేషన్ల పరిశీలన పూర్తి



దాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ ఎన్నికలకు దాఖలైన నామినేషన్ పత్రాల పరిశీలన అనంతరం వాటిని అధికారులు ఆమోదించినట్టు కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు. వైఎస్సార్ సీపీ నుంచి 10 మంది, తెలుగుదేశం నుంచి 10 మంది కార్పొరేటర్లు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. నామినేషన్ పత్రాల్లో ఎటువంటి అభ్యంతరాలు లేకపోవడంతో వారందర్నీ అర్హులుగా ప్రకటించినట్లు కమిషనర్ వెల్లడించారు. ఈ నెల 15వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. 19న ఎన్నికలు నిర్వహించి.. అదే రోజు ఫలితాలు వెల్లడించనున్నట్లు కమిషనర్ తెలిపారు.

యూపీఎస్సీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

మహారాణిపేట: యూపీఎస్సీ నిర్వహించనున్న కంబైన్డ్ మెడికల్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని డీఆర్వో శ్రీనివాసమూర్తి అధికారులను ఆదేశించారు. పరీక్ష నిర్వహణపై బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. జిల్లాలోని మూడు పరీక్ష కేంద్రాల్లో ఈ నెల 16 ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. జిల్లా నుంచి 892 మంది పరీక్షలకు హాజరుకానున్నారని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, అభ్యర్థుల కోసం ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్, జీవీఎంసీ, విద్యుత్, పోస్టల్, ఆర్టీసీ, వైద్య అధికారులు పాల్గొన్నారు.

అటు రక్షణ.. ఇటు అభివృద్ధి

- ఎర్రమట్టి దిబ్బల సంరక్షణకు 148 అడుగుల బఫర్ జోన్ ఏర్పాటు
- అక్కడకు సమీపంలో లే అవుట్ల రక్షణ
- అక్కడ జీడి, తాటి చెట్లు పెంచుతున్న రైతులు
- 1982లో డీ-పట్టాలు అందించిన అప్పటి ప్రభుత్వం
- ఆ భూముల్నే రైతుల నుంచి ఇష్టపూర్వకంగా సమీకరణ

సాక్షి, విశాఖపట్నం: భౌగోళిక వారసత్వ ప్రాంత ఉనికికి ప్రమాదం వాటిల్లకుండా రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి ప్రణాళికలు అమలు చేస్తోంది. జియో హెరిటేజ్ సైట్ ఎర్ర దిబ్బలు ఆక్రమణలకు గురికాకుండా ఏకంగా 148 అడుగుల మేర ప్రత్యేక బఫర్ జోన్ ఏర్పాటు చేసింది. దానికి సమీపంలోని భూములను సమీకరించి వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. జీడి, తాటిచెట్లు పెంచుతున్న రైతులు స్వచ్ఛందంగా ఆ భూములను ప్రభుత్వానికి అందించడం విశేషం.

సర్వే నం 49లో నేరెళ్లవలస గ్రామం ఉంది. ఇక్కడ సర్వే నం.49/1లో మొత్తం 1067 ఎకరాలు ఉండగా.. ఇందులో 550 ఎకరాల్లో ఐఎన్‌ఎస్ కళింగ విస్తరించింది. సుప్రీంకోర్టుకు వెళ్లి తమకు చెందిన స్థలమని విజయం సాధించిన బిల్డింగ్ సొసైటీ పేరుతో 287 ఎకరాలు ఉన్నాయి. ఈ రెండింటి మధ్యలో 262 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఎర్రమట్టి దిబ్బలు ఉన్న ప్రాంతాన్ని ప్రభుత్వం జియో హెరిటేజ్ సైట్‌గా గుర్తించింది. దీనికి సమీపంలో కొత్తవలస గ్రామ పరిధిలోని సర్వే నం.75, సర్వే నం.86, 87లో సుమారు 80 ఎకరాల్లో డీ-పట్టాలు ఇచ్చారు. ఈ డీ పట్టాలు ఇచ్చిన ప్రాంతంలోనే ప్రస్తుతం లేఅవుట్లను అభివృద్ధి చేస్తున్నారు.

భవిష్యత్‌లో ముప్పు వాటిల్లకుండా..

ఎర్రమట్టి దిబ్బలకు ప్రస్తుతం లే అవుట్ అభివృద్ధి చేస్తున్న స్థలానికి మధ్య దాదాపు 148 అడుగుల మేర బఫర్ జోన్ ఏర్పాటు చేసి.. ఆ ప్రాంతాన్ని సంరక్షించారు. భౌగోళిక వారసత్వ సంపదగా.. విశాఖ పర్యాటక ఖ్యాతిని ఇనుమడింపజేస్తున్న ఎర్రమట్టి దిబ్బలుకు భవిష్యత్‌లోనూ ఎలాంటి ముప్పు రాకుండా బఫర్ జోన్ ఏర్పాటు చేసి సంరక్షించేందుకు అధికారులు పక్కాగా చర్యలు తీసుకున్నారు.



ఎరుపు రంగులో ఉన్నది జియో హెరిటేజ్ సైట్, పింక్ రంగులో ఉన్నది పూలింగ్ చేసిన భూమి

కొత్తవలసలోని సర్వే నం.86/1ని సబ్ డివిజన్ చేసి.. **86/3ని బఫర్‌జోన్‌గా గు**ర్తించారు. ఎర్రగా మట్టి కనిపిస్తే **చాలు.. అవి ఎర్ర**మట్టి దిబ్బలే అన్నట్లుగా **ఇటీవల కొన్ని పత్రికలు** విష ప్రచారం చేశాయి. ఎర్ర**మట్టి దిబ్బల చుట్టూ ఉన్న** భూములు కూడా ఎర్రమ**ట్టితోనే కనిపిస్తున్నాయి.** ఇప్పుడు అభివృద్ధి చేస్తున్న **లేఅవుట్ కూడా అలాంటి**దే. హెరిటేజ్ సైట్‌కు సంబంధం లేదు. ఇక్కడ పదుల సంఖ్యలో సమీప గ్రామాలకు చెందిన రైతుల భూములున్నాయి. దాదాపు 70 నుంచి 80 ఏళ్ల నుంచి ఈ భూముల్లో జీడి తోటలు, తాటిచెట్లు పెంచుకుంటూ.. వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని అనుభవిస్తున్నారు. వీరికి 1982లో అప్పటి ప్రభుత్వం డీ-పట్టాలిచ్చింది. ఆ డీ-పట్టా భూముల్లో తోటలున్న ప్రాంతాన్ని ప్రభుత్వం ఇప్పుడు భూ సమీకరణ చేసింది.

సజావుగా సమీకరణ

2019 నవంబర్‌లోనే భూ సమీకరణకు ఫారం-1ని ప్రకటించింది. డీ-పట్టా భూములున్న రైతులతో అధికారులు నాలుగు సార్లు గ్రామ సభలు నిర్వహించారు. దండోరా వేశారు. అనంతరం అభ్యంతరాలు స్వీకరించేందుకు ఎల్పీవోలు పొందుతున్న రైతుల జాబితాలను సచివాలయంలో ప్రదర్శించారు. ఎలాంటి అభ్యంతరాలు రాకపోవడంతో.. భూ సమీకరణ కార్యక్రమాన్ని ఆరు నెలల పాటు నిర్వహించారు. ల్యాండ్ పూలింగ్ చట్టం ప్రకారం రైతులకు పరిహారం చెల్లించారు. సర్వే నం.75లో 9 మంది రైతుల నుంచి 42 ఎకరాలు, 87/2లో ముగ్గురు నుంచి 11.20 ఎకరాలు, 86లో ఆరుగురి నుంచి 9.80 ఎకరాలు చొప్పున మొత్తం 63 ఎకరాలు పూలింగ్ చేశారు. ప్రతి ఒక్క రైతూ ఇష్టపూర్వకంగానే తమ ఆధీనంలో ఉన్న డీ-పట్టా భూములను ప్రభుత్వానికి అప్పగించారు. ఆరు నెలలుగా ఈ లేఅవుట్ చదును చేసే ప్రక్రియ జరుగుతోంది. అయితే ల్యాండ్ పూలింగ్‌కు సంబంధించి నలుగురు వ్యక్తులు కోర్టుకు వెళ్లారు. స్పందనలో దరఖాస్తు చేసుకున్నామనీ.. దాన్ని పరిష్కరించాలని మాత్రమే కోరుతూ హై కోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. అది ఇప్పటికి ఒక్కసారి కూడా హియరింగ్‌కు రాలేదు. ఆ పిటిషన్‌ను హైకోర్టు పెండింగ్‌లోనే పెట్టింది.



ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్‌లో సమీకరించిన భూములివే..

ఎర్రమట్టి దిబ్బలకు సంబంధం లేదు



మా తండ్రుల కాలం నుంచి ఆ భూమిలో జీడి తోటలు, తాటిచెట్లు ఉన్నాయి. అందులో వచ్చే ఆదాయాన్ని అనుభవిస్తున్నాం. మా తోటలకు ఎర్ర మట్టి దిబ్బలకు సంబంధమే లేదయ్యా. ఎందుకలగ అంటున్నారో అర్థం కాలేదు. ఎర్రమట్టి దిబ్బలను పాడు చేస్తున్నారని పేపర్లలో వచ్చిందని శానా మంది చెప్పారు. అది విన్నాక శానా బాధనిపించింది. అసలు దానికి మా తోటలకు బాగా దూరం ఉంది. మా తోటలను తీసుకొని చట్టం ప్రకారం అధికారులు పరిహారం ఇస్తామన్నారు. అందరం మాట్లాడుకొని ఒప్పేసుకున్నాం. ఆ భూముల్లో ఇప్పుడు జీడి కూడా సరిగా కాయట్లేదు.

– పాసి అప్పల నాయుడు, జేవీ అగ్రహారం

అందరం మాట్లాడుకుని.. ఒప్పకున్నాం



మాకు కొత్తవలస దగ్గర 5 ఎకరాలుంది. అందులో జీడి చెట్లు ఉన్నాయి. ఆ తోటలను మేమే ముందు చూసేవాళ్లం. తర్వాత రెండేళ్లు, నాలుగేళ్లు.. ఇలా లీజుకి చేసుకునేవాళ్లం. 40 ఏళ్ల కిందట ప్రభుత్వం మా పేరుతో డీపట్టాలిచ్చింది. ల్యాండ్ పూలింగ్ గురించి అధికారులు చెప్పడంతో రైతులందరం సమావేశమై.. ఇచ్చేయాలని నిర్ణయించుకున్నాం. అధికారులు గ్రామ సభలు నిర్వహించినప్పుడు ప్రతి ఒక్క రైతు హాజరయ్యారు. అందరికీ మంచి పరిహారం ఇస్తున్నారు. ఇప్పుడు భూములు లాక్కొన్నారని అంటున్నవారు అప్పుడు ఏం మాట్లాడలేదు. అసలు వారికి నిజంగా అక్కడ భూములుంటే అప్పుడు ఎందుకు మాట్లాడలేదు?

– నరసింగరావు, డీ-పట్టాదారుడు

ఎర్రమట్టి దిబ్బలకు బఫర్ జోన్‌తో సంరక్షణ



జియో హెరిటేజ్ సైట్‌గా గుర్తించిన ఎర్రమట్టి దిబ్బల ప్రాంతానికి ఎలాంటి ముప్పు వాటిల్లకుండా.. దానికి దూరంగా ఉండే ప్రాంతంలోనే ల్యాండ్ పూలింగ్ చేపట్టాం. ప్రభుత్వ నిబంధనలు, చట్టాలను ఉల్లంఘించకుండా.. కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్డీవో పర్యవేక్షణలో వారసత్వ సంపద పరిరక్షణ కోసం బఫర్ జోన్ ఏర్పాటు చేశాం. మిగిలిన ప్రాంతంలో భూములను రైతులందరి ఆమోదంతోనే ల్యాండ్‌పూలింగ్ నిర్వహించాం. రెవెన్యూ, హార్టికల్చర్, అగ్రికల్చర్, ఇరిగేషన్, ఫారెస్ట్ అధికారుల సమక్షంలో ఈ ప్రక్రియ జరిగింది. ఇందులో ఒక రైతు పూలింగ్‌కు అంగీకరించకపోతే.. అతన్ని మినహాయించాం. ఏ ఒక్కరికీ ఇబ్బంది కలగకుండా.. లే అవుట్ అభివృద్ధి జరుగుతోంది.

– కోరాడ వేణుగోపాల్, భీమిలి తహసీల్దార్

ప్రధాన రోడ్ల విస్తరణకు ప్రతిపాదనలు

అధికారులకు జీవీఎంసీ కమిషనర్ ఆదేశం



అక్కయ్యపాలెం రోడ్ విస్తరణపై అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

సీతంపేట: నగరంలో ప్రధాన రహదారులు, కూడళ్ల విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. జోన్-5 పరిధిలో బుధవారం ఆయన క్షేత్రస్థాయి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఆర్‌ఎం కార్యాలయం నుంచి అక్కయ్యపాలెం మీదుగా హైవే వరకు 60 అడుగుల రోడ్ విస్తరణ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రధాన రహదారులు, జగ్గారావు వంతెన వద్ద పారిశుధ్యం నిర్వహణ బాగా లేకపోవడంతో.. శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. వెంటనే పారిశుధ్య కార్మికులతో చెత్త, వ్యర్థాలను తొలగింపజేశారు. ప్రతి దుకాణం ముందు చెత్త బుట్ట ఉండాలని స్పష్టం చేశారు. అనంతరం గవర్నర్ బంగ్లా నుంచి నౌరోజీ రోడ్డు వరకు 60 అడుగుల రోడ్డు విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశిస్తూ.. వారికి కొన్ని సూచనలు చేశారు. పట్టణ ప్రణాళిక అధికారి సునీత, జోనల్ కమిషనర్లు ఆర్‌జీవీ కృష్ణ, శివప్రసాద్, పర్యవేక్షక ఇంజినీర్ వేణుగోపాల్, ఏసీపీలు రఘునాథ, వినయప్రసాద్, కార్యనిర్వాహక ఇంజినీర్ రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఏఐయూ జట్టు కోచ్‌గా పోలిరెడ్డి

విశాఖ స్పోర్ట్స్: ఇండియన్ యూనివర్సిటీస్ బ్యాడ్మింటన్ జట్టు కోచ్‌గా వ్యాయామ అధ్యాపకుడు వై.పోలిరెడ్డి ఎంపికయ్యారు. చైనాలోని చెంగ్డులో వరల్డ్ యూనివర్సిటీ క్రీడలు జరగనున్నాయి. వీటిలో అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్(ఏఐయూ) జట్టు పాల్గొననుంది. ఈ నెల 28 నుంచి ఆగస్టు 8వ తేదీ వరకు ఈ పోటీలు జరగనుండగా.. పోలిరెడ్డి ఏఐయూ బ్యాడ్మింటన్ జట్టుకు సేవలందించనున్నారు.

రెచ్చిపోయిన జనసైనికులు

- పవన్ వ్యాఖ్యలను నిరసిస్తూ వలంటీర్లు ఆందోళన
- అల్లకల్లోలం సృష్టించిన జనసేన సైనికులు
- కాలుతున్న దిష్టిబొమ్మ విసిరేయగా మహిళ చీరకు నిప్పు
- మహిళా పోలీసులపైన పాలు చల్లిన వైనం



వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడి చేస్తున్న జనసేన కార్యకర్తలు

సాక్షి, విశాఖపట్నం/జగదాంబ: నిస్వార్థంగా సేవలందిస్తున్న వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్ కల్యాణ్ వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ 35వ వార్డు పూర్ణామార్కెట్ జంక్షన్‌లో బుధవారం నిర్వహించిన నిరసన ప్రదర్శన ఉద్రిక్తతకు దారితీసింది. పవన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న సమయంలో జనసైనికుల పేరుతో కొందరు యువకులు అక్కడికి చేరుకున్నారు. ప్రశాంత వాతావరణంలో జరుగుతున్న ప్రదర్శనలో అల్లకల్లోలం సృష్టించారు. పవన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లను అడ్డుకునేందుకు వీధిరౌడీల్లా ఎగబడ్డారు. వలంటీర్లు, మహిళలు, సాధారణ ప్రజలు, పోలీసులు అని చూడకుండా.. ఎవరు ఎదురుగా ఉంటే వారిపై తిరగబడ్డారు. చివరికి మహిళా పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించారు. పోలీసులు సంయమనం పాటించి వారిని నిలువరిస్తున్నా.. మద్యం మత్తులో జోగుతున్న జనసైనికులు వారిపై పాలు చల్లారు. మంటలంటుకొని ఉన్న పవన్ దిష్టిబొమ్మని మహిళా వలంటీర్లపైకి విసిరారు. దీంతో ఆ మంటల నుంచి తప్పించుకునేందుకు వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పరుగులు పెట్టారు. దిష్టిబొమ్మ ముక్కలు పడిపోవడంతో కండిపిల్లి వరలక్ష్మి చీరకు నిప్పంటుకుంది. స్థానికులు వెంటనే అప్రమత్తమై మంటల్ని అదుపు చేయడంతో ప్రమాదం నుంచి బయటపడింది. దాడికి పాల్పడ్డ 14 మంది జనసైనికులను టూ టౌన్‌పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జీవీఎంసీ 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 35వ వార్డు వలంటీర్లు, దుర్గాలమ్మ దేవస్థానం చైర్మన్ నాయిని మల్లిబాబు, మంగరాజు, కండిపల్లి వరలక్ష్మి, రమణమ్మ, నీలకంఠం, గౌరిశంకర్ పాల్గొన్నారు.



పోలీసులతో జనసేన కార్యకర్తల వాగ్వాదం



మహిళా ఎస్‌ఐలు, ఏసీపీపై పాలు చల్లిన జనసేన కార్యకర్తలు

నువ్వా రాష్ట్రాన్ని ఉద్ధరించేది..



మహిళలపై తప్పుడు వ్యాఖ్యలు చేయడమే కాకుండా వారిపై దాడులు కూడా చేయిస్తున్న పవన్‌కల్యాణా రాష్ట్రాన్ని ఉద్ధరిస్తాడు? అతని చర్యలతో రాష్ట్రంలో ఏ మహిళను ఆయన గౌరవించడని తెలిసిపోయింది.

– సూర్యకుమారి, వలంటీర్, పండావీధి

దాడులు చేసినా నిరసనలు ఆగవు



దాడులు చేసినా క్షమాపణ చెప్పే వరకు నిరసనలు ఆగవు.. వలంటీర్లు అంటే సేవ చేసేవారు అని తెలుసుకో. మహిళలను గౌరవించాలని పవన్ కల్యాణ్ తెలుసుకుంటే మంచిది.

–మణికంత, వలంటీర్, ప్రసాద్‌గార్డెన్స్

ఇదేనా మహిళలకు ఇచ్చే గౌరవం



మహిళలకు పవన్ కల్యాణ్ ఎంతటి గౌరవం ఇస్తారో అర్థమవుతోంది. శాంతియుతంగా నిరసన చేస్తున్న మహిళలపై దాడి చేయించడం తగదు. నీ వ్యక్తిత్వం ఏమిటో మొన్న ఏలూరులో.. ఈరోజు పూర్ణామార్కెట్‌లో తెలిసింది.

– రూప, పూర్ణామార్కెట్, కల్లుపాకలు.

ఐటీఐలో రెండో విడత ప్రవేశాలు

దరఖాస్తుకు 31వ తేదీ ఆఖరు

కంచరపాలెం: జిల్లాలోని ప్రభుత్వ/ప్రైవేట్ ఐటీఐల్లో 2023-24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు రెండో విడత ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అభ్యర్థులు https://iti.ap.gov.in/ లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐల ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలకు ఒక దరఖాస్తు సరిపోతుంది. నమోదు అనంతరం విద్యార్థులు తమ దగ్గరలోని ఏదైనా ప్రభుత్వ ఐటీఐలో సర్టిఫికెట్లు పరిశీలన చేయించుకోవాలి. స్టీల్‌ప్లాంట్ ఆర్ కార్డుకు సంబంధించిన అభ్యర్థులు ప్రత్యేక కేటగిరీలో దరఖాస్తు చేసుకోవాలి. ఈ నెల 31 సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను మాత్రమే పరిగణలోకి తీసుకుంటారు. ఆగస్టు 3, 4 తేదీల్లో ప్రభుత్వ ఐటీఐ(ఓల్డ్), 5, 6, 7 తేదీల్లో ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశాల కోసం కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ప్రభుత్వ ఐటీఐ కంచరపాలెం, ప్రభుత్వ ఐటీఐ(బాలికలు)-ఇండస్ట్రియల్ ఎస్టేట్, ప్రభుత్వ ఐటీఐ(కొత్త)-గాజువాక, ప్రభుత్వ ఐటీఐ-నరవలో సర్టిఫికెట్లను పరిశీలిస్తారని ప్రిన్సిపాల్ శ్రీకాంత్ తెలిపారు.

సెప్టెంబర్ 28, 29 తేదీల్లో జాతీయ సదస్సు

ఏయూ క్యాంపస్: ఏయూ అణుభౌతిక శాస్త్ర విభాగం, నేషనల్ అసోసియేషన్ ఫర్ అప్లికేషన్ ఆఫ్ రేడియో ఐసోటోప్స్ అండ్ రేడియేషన్ ఇన్ ఇండస్ట్రీ(ఎన్‌ఏఏఆర్‌ఐ-ముంబయి) సంయుక్తంగా నిర్వహించనున్న జాతీయ సదస్సు పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డితో కలిసి ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఆవిష్కరించారు. సెప్టెంబర్ 28, 29 తేదీల్లో 'రీసెంట్ ట్రెండ్స్ అండ్ అప్లికేషన్స్ ఆఫ్ రేడియో ఐసోటోప్స్ అండ్ రేడియేషన్ టెక్నాలజీస్' సదస్సు జరగనుంది. రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, సదస్సు కన్వీనర్ ఆచార్య ఎ.డి.పి.రావు పాల్గొన్నారు.

దొంగతనం కేసుల్లో వ్యక్తికి మూడేళ్ల జైలు

కూర్మన్నపాలెం: దువ్వాడ క్రైం పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగతనాలకు పాల్పడిన షేక్‌గౌస్‌కు 8వ ఏసీఎం కోర్టు జడ్జి వై.శ్రీలక్ష్మి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధించారు. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలివీ.. 2021లో సెల్‌ఫోన్ షాపులో ఫోన్లు దొంగతనం చేసినందుకు షేక్‌గౌస్‌కు రెండేళ్ల జైలు, రూ.500 జరిమానా, అలాగే 7 కుట్టు మిషన్లు, 7 మోటారు హెడ్స్, 5 సీలింగ్ ఫ్యాన్లు, 2000 లీటర్ల వాటర్ ట్యాంక్‌ను దొంగతనం చేసిన కేసుల్లో ఏడాది జైలు, రూ.500 జరిమానా విధించారు. కేసులను ఛేదించి నిందితుడికి శిక్ష పడటంతో ప్రతిభ చూపిన క్రైం ఏసీపీ వెంకటరావు, గాజువాక క్రైం సీఐ సూర్యనారాయణ, దువ్వాడ క్రైం ఎస్సై డి.కాళిదాసు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.వాణి, కానిస్టేబుల్ నాయుడు, కోర్టు కానిస్టేబుల్ హరీష్‌ను సీపీ త్రివిక్రమ్ వర్మ అభినందించారు.

పలు రైళ్లు రీషెడ్యూల్

తాటిచెట్లపాలెం: ఆయా స్టేషన్లలో బుధవారం పలు రైళ్లు ఆలస్యంగా బయల్దేరినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. హౌరా–చెన్నై సెంట్రల్ (12839) మెయిల్ ఎక్స్‌ప్రెస్, షాలిమార్–చెన్నై సెంట్రల్ (12841) కోరమండల్ ఎక్స్‌ప్రెస్, ఎస్ఎంవీ బెంగళూరు–హౌరా (12864) ఎక్స్‌ప్రెస్ ఆలస్యంగా బయలుదేరాయి.



'పెర్ఫార్మెన్స్' టాప్

- పెర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ ఫర్ డిస్ట్రిక్ట్‌లో రాష్ట్రంలో ఉమ్మడి విశాఖకు తొలిస్థానం
- అభ్యసన ఫలితాల్లో గణనీయమైన పెరుగుదల
- పాఠశాలల భద్రత, విద్యార్థుల సంరక్షణలోనూ మేటి
- ప్రభుత్వ స్కూళ్లలో మెరుగైన మౌలిక సౌకర్యాలు



మధురానగర్ స్కూల్లో తరగతుల నిర్వహణ

విశాఖ విద్య: విద్యా కార్యక్రమాల అమల్లో రాష్ట్రంలో ఉమ్మడి విశాఖ జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. 'పెర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ ఫర్ డిస్ట్రిక్ట్ పేరిట 2021–22 విద్యా సంవత్సరాన్ని పరిగణలోకి తీసుకొని కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో చేసిన సర్వే నివేదికను తాజాగా విడుదల చేసింది. 'పాఠశాలల్లో భద్రత– విద్యార్థుల సంరక్షణ, మౌలిక వసతులు, అభ్యసన ఫలితాలు, తరగతి గదిలో ప్రతిభా వంతమైన కార్యక్రమాలు, విద్యార్థుల హక్కులు, డిజిటల్ చదువులు, పరిపాలన పరమైన ప్రక్రియ' అనే ఆరు అంశాల కొలమానంగా చేపట్టిన సర్వేలో ప్రభుత్వ పాఠశాలల్లో గతంలో కంటే మెరుగైన ఫలితాలు కనిపిస్తున్నాయని కేంద్ర విద్యాశాఖ వెల్లడించింది. కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున చూపుతున్న ప్రత్యేక చొరవ, ఉమ్మడి విశాఖ జిల్లాకు నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న ఎల్.చంద్రకళ కృషితో జిల్లా విద్యాశాఖ పురోభివృద్ధి దిశగా ముందుకెళ్తోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన నాడు–నేడు వంటి బృహత్తర కార్యక్రమాలతోనే ఇది సాధ్యమైందని ఉమ్మడి విశాఖ జిల్లా విద్యానిపుణులు అంటున్నారు.

అన్ని అంశాల్లోనూ విశాఖ బెస్ట్

జిల్లా విద్యాశాఖ పనితీరును లెక్కించే క్రమంలో పన్నెండు అంశాలుగా విభజించి కేంద్ర విద్యాశాఖ ఆధీనంలోని ప్రత్యేక నిపుణుల బృందం నిశిత పరిశీలన జరిపింది. అభ్యసన ఫలితాలు–నాణ్యత, పాఠశాలలు అందుబాటు, ఉపాధ్యాయుల లభ్యత – వృత్తి పరమైన అభివృద్ధి ఫలితాలు, అభ్యాస మెలకువల నిర్వహణ– అభ్యాసాన్ని మెరుగు పరచటానికి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడటం, మౌలిక వసతులు, విద్యార్థి అర్హతలు, పాఠశాలల భద్రత–సంరక్షణ చర్యలు, డిజిటల్ అభ్యాసం, నిధుల సమీకరణ– వినియోగం, సీఆర్‌సీ పనితీరు మెరుగుపరుచుటం, హాజరుపట్టి పర్యవేక్షణ, పాఠశాలల్లో నాయకత్వ అభివృద్ధి వంటి అంశాల బేరీజుగా 600 మార్కులు కేటాయించి చేపట్టిన సమగ్ర సర్వేలో ఉమ్మడి విశాఖ జిల్లా ఓవరాల్‌గా 397 మార్కులు సాధించింది. అత్యుత్తమ పనితీరుకు నిదర్శనంగా 'ఉత్తమ్ గ్రేడ్' దక్కించుకొని, రాష్ట్రంలో నంబర్‌వన్ స్థానంలో నిలిచింది.



ట్యాబ్‌ల్లో బైజూస్ పాఠాలు తిలకిస్తున్న విద్యార్థినులు

పైపైకి విద్యా ప్రగతి

విద్యా ప్రమాణాల వాస్తవ పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఏటా సమగ్ర సర్వే నిర్వహిస్తారు. కేంద్ర సహకారంతో రాష్ట్రాల్లో విద్యారంగ అభివృద్ధికి వెచ్చిస్తున్న నిధుల వినియోగం ద్వారా ఎలాంటి ఫలితాలు వస్తున్నాయనేది ఈ సర్వే ద్వారా తెలుసుకుంటారు. 2020–21లో చేపట్టిన సర్వే మేరకు ఉమ్మడి విశాఖ జిల్లా విద్యా కార్యక్రమాల అమల్లో ఓవరాల్‌గా 370 మార్కులు సాధించి రాష్ట్రంలో 11 స్థానంలో ఉండగా, 2021–22కు ఏకంగా మొదటి స్థానం దక్కించుకోవడం ద్వారా మెరుగైన పనితీరు కనబరుస్తోంది.

ఇది సమష్టి కృషి ఫలితం



విద్యా కార్యక్రమాల అమల్లో ఉమ్మడి విశాఖ జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలవడం ఎంతో ఆనందంగా ఉంది. కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ సూచనలు మా విద్యాశాఖకు ఎంతో దోహదపడుతున్నాయి. మరి ముఖ్యంగా ఉపాధ్యాయుల కృషి ఫలితంగానే ఇది సాంతమైంది. మరింత బాధ్యతగా పనిచేస్తాం

–ఎల్.చంద్రకళ, డీఈవో, నోడల్ అధికారి ఉమ్మడి విశాఖ జిల్లా

చాలా సంతోషంగా ఉంది



పెర్ఫార్మెన్స్ గ్రేడింగ్‌లో ఉమ్మడి విశాఖ జిల్లా నంబర్‌వన్ స్థానం దక్కించుకోవటం చాలా సంతోషంగా ఉంది. విద్యాభివృద్ధి కోసమని ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల ఫలితంగానే ఇది సాంతమైంది. నాడు–నేడు వంటి కార్యక్రమాలతో పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారాయి. రానున్న రోజుల్లో మరిన్ని వినూత్న కార్యక్రమాలు చేపడతాం.

–బి.శ్రీనివాసరావు, ఎస్ఎస్ఏ, అడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్, విశాఖ జిల్లా

వరకట్న వేధింపులకు మహిళ బలి

- భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్య



కొత్తకోట లక్ష్మి (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: వరకట్న వేధింపులు తాళలేక ఓ మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గాజువాక పోలీస్ స్టేషన్ పరిధి వాంబే కాలనీలో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గాజువాక ఏసీపీ త్రినాథ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వాంబేకాలనీలో నివసిస్తున్న కొత్తకోట లక్ష్మి (27), సంతోష్ దంపతులు. కొద్ది సంవత్సరాల క్రితం శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస నుంచి ఉపాధి కోసం వచ్చి ఇక్కడ స్థిరపడ్డారు. ఇద్దరూ కూలిపనులు చేసుకుని జీవించేవారు. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మంగళవారం ఉదయం పనికి వెళ్లిన సంతోష్ రాత్రి ఇంటికి వచ్చేసరికి లక్ష్మి ఉరి వేసుకుని ఉండటంతో, వెంటనే ఆమదాలవలసలో ఉంటున్న లక్ష్మి తల్లిదండ్రులకు సమాచారం అందించాడు. స్థానికుల సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న గాజువాక పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సంతోష్, లక్ష్మి మధ్య మనస్పర్థలున్నాయని, వరకట్న వేధింపులు కూడా కలహాలకు కారణమని ఇరుగుపొరుగు వారు తెలిపారు. సంతోష్ మద్యానికి బానిసై నిత్యం లక్ష్మిని వేధింపులకు గురి చేసేవాడని తెలియజేశారు. అదనపు కట్నం తేవాలని తమ కుమార్తెను నిత్యం వేధించేవాడని మృతురాలి తండ్రి ఫిర్యాదులో పేర్కొనడంతో పోలీసులు వరకట్న వేధింపుల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఏసీపీ త్రినాథ్ కేసు దర్యాప్తు చేయనున్నారు.

నగరంలో నేడు

- ఉదయం 10.45 గంటలకు హోటల్ గేట్‌వేలో వీవెజ్ అండ్ క్రాఫ్ట్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం
- మధ్యాహ్నం 3.45 గంటలకు బీచ్‌రోడ్డులోని నోవాటెల్‌లో ఏపీసీఐఐ, ఎస్ఐడీఎం ఏపీ చాప్టర్స్ సంయుక్తంగా సెమినార్

* * *

'గంగవరం పోర్టు కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం'

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో పని చేస్తున్న ఉద్యోగుల సంక్షేమానికి యాజమాన్యం కట్టుబడి ఉందని యాజమాన్య ప్రతినిధులు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోందని ప్రకటనలో వివరించారు. గంగవరం పోర్టు ప్రాంగణంలో ఇటీవల నిర్వహించిన సద్భావన సమావేశానికి మొత్తం 30 మంది యాజమాన్య ప్రతినిధులు హాజరై పలు అంశాలపై చర్చించారని తెలియజేశారు. ఉద్యోగుల సూచనలను పరిగణనలోకి తీసుకుని, ఎక్స్‌గ్రేషియా చెల్లించడానికి యాజమాన్యం సిద్ధంగా ఉందని తెలిపారు. ఉద్యోగులు మళ్లీ విధులకు హాజరు కావాలని కోరారు. 25 మంది ఉద్యోగులు షరతులు లేకుండా విధులు నిర్వర్తించేందుకు పోర్టు మేనేజ్‌మెంట్ అంగీకారం తెలిపిందని వివరించారు. సస్పెండైన నలుగురు ఉద్యోగులు తమ వివరణలను సమర్పిస్తే, యాజమాన్యం సమీక్షించి మళ్లీ వారిని విధుల్లోకి తీసుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకోనుందని పేర్కొన్నారు. జీపీఎస్ ఉద్యోగుల ఐడీ కార్డుల్లో అదానీకి అనుబంధ సంస్థగా సూచిస్తామంటూ జీపీఎల్, జీపీఎస్ మధ్య ఉన్న వేరియేషన్ సమస్యపై స్పష్టత ఇచ్చారు. హెచ్‌ఆర్ పాలసీల ప్రకారం తగిన ప్రయోజనాలు జీపీఎస్ ఉద్యోగులకు కూడా ఇస్తామని తెలిపారు. బీమా పాలసీ ప్రకారం పోర్టు లోపల జరిగే ప్రమాదాలకు పరిహారం పొడిగిస్తామని ప్రకటించారు.

లారీని ఢీకొన్న కారు.. ఏడుగురికి గాయాలు

- క్షతగాత్రులంది వేములవలస



ప్రమాదంలో గాయపడిన వేములవలస వాసులు

నక్కపల్లి/తగరపువలస/కాకినాడ క్రైం : జాతీయ రహదారిపై దేవవరం సమీపంలో ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టడంతో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలివీ.. ఆనందపురం మండలం వేములవలస గ్రామానికి చెందిన పట్నాల ప్రసాద్ తన తండ్రి నరసింగరావు, తల్లి విజయలక్ష్మి అనారోగ్యంగా ఉండడంతో భద్రాచలంలో ఆయుర్వేద వైద్యుడికి చూపించేందుకు సోమవారం తన కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో బుధవారం వేకువ జామున దేవవరం దగ్గర జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న లారీని వీరు ప్రయాణిస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో ప్రసాద్ తల్లిదండ్రులతోపాటు భార్య రమాదేవి, పిల్లలు సాయి భార్గవి, నిఖిల్, డ్రైవర్ దినేష్‌లకు తీవ్రగాయాలయ్యాయి. ముఖాలు, కాళ్లు చేతులకు తీవ్రగాయాలై రక్తస్రావం కావడంతో స్థానికులు 108 వాహనంలో వారిని కాకినాడ జనరల్ ఆస్పత్రికి తరలించారు. దినేష్ పరిస్థితి విషమంగా ఉండటంతో అతన్ని కాకినాడలోని కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించారు. మిగిలిన వారిని వారి బంధువులు సంగివలస అనిల్ నీరుకొండ జనరల్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. నిద్రమత్తులోనే ఈ ఘటన జరిగిందని పోలీసులు భావిస్తున్నారు. బాధితులను నర్సీపట్నం ఏఎస్పీ అధిరా ఎస్.రాణా పరామర్శించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శిరీష తెలిపారు.

రైల్వే హాస్పిటల్‌లో ఆధునిక ఆపరేషన్ థియేటర్

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): వాల్తేర్ డివిజన్ రైల్వే హాస్పిటల్‌లో ఆధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్‌ను బుధవారం డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి ప్రారంభించారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్‌లోనే మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్‌తో కూడిన మొదటి హాస్పిటల్ ఇదని రైల్వే అధికారులు తెలిపారు. దీని ఏర్పాటులో డీఆర్ఎం కీలక పాత్ర పోషించారని చెప్పారు. ఈ ఆపరేషన్ థియేటర్ రోగులకు మరిన్ని ఉన్నత ప్రమాణాలతో కూడిన సేవలందిస్తుందన్నారు. ఈ కాంప్లెక్స్‌లో అత్యాధునిక, అత్యున్నత ప్రమాణాలతో కూడిన అనస్తీషియా, సర్జరీ పెండంట్స్, ఆపరేషన్ థియేటర్ లైట్స్, కంటి సర్జరీల కోసం అదనపు గది, సెప్టిక్, ఎండోస్కోపిక్ ఆపరేషన్లకు ప్రత్యేక గది ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ ప్రత్యేక ఏర్పాట్లతో డివిజనల్ రైల్వే హాస్పిటల్ కార్పొరేట్, ప్రభుత్వ వైద్య సంస్థల జాబితాలో చేరినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఆపరేషన్ థియేటర్ ప్రారంభంపై హాస్పిటల్ వైద్యులు, రైల్వే ఉద్యోగులు, యూనియన్ల ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహూ(ఆపరేషన్స్), చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ తిరు అరుల్‌జోతి, అడిషనల్ సీఎంఎస్‌లు డాక్టర్ కాశీపతి, డాక్టర్ మహేష్‌కుమార్, సీనియర్ డివిజనల్ ఇంజినీర్(కో ఆర్డినేషన్) ఎ.కె.మహరాణా, ఇతర అధికారులు, ఈకార్వో వైస్ ప్రెసిడెంట్ మధుస్మిత సాహూ, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

డాల్ఫిన్ డయాగ్నసిస్ సేవలు అభినందనీయం

- జర్నలిస్టులకు వైద్య పరీక్షలపై కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట(విశాఖ దక్షిణ): ప్రజలకు వార్తలను చేరవేసేందుకు ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా నిరంతరం కృషి చేస్తున్న జర్నలిస్టులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించిన డాల్ఫిన్ డయాగ్నసిస్ సంస్థ అధినేత డాక్టర్ వి.సురేష్, డాక్టర్ లక్ష్మీప్రసన్నలను కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అభినందించారు. జిల్లా యంత్రాంగం కోరిక మేరకు గత నెల 10న రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజిని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. జిల్లాలోని జర్నలిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారని చెప్పారు. డాక్టర్ వి.సురేష్ మాట్లాడుతూ కలెక్టర్ మల్లికార్జున ప్రోత్సాహంతో తమ కార్యాలయంలో ప్రారంభించిన ఈ కార్యక్రమంలో సుమారు 150 మంది వరకు అక్రిడేషన్ పొందిన జర్నలిస్టులు వైద్య సేవలు పొందారని తెలిపారు. బ్లడ్ కౌంట్(సీబీసీ), థైరాయిడ్ ప్రొఫైల్, లివర్ ప్రొఫైల్, యూనిర్ ఎనాలసిస్, రెనాల్ ప్రొఫైల్, ఈసీజీ, చెస్ట్ ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ స్కానింగ్ తదితర పరీక్షలను ఉచితంగా నిర్వహించి సంబంధిత రిపోర్టులను జర్నలిస్టులకు అందజేశామన్నారు.

బ్యాడ్మింటన్ పోటీల విజేతలు కోమల్, ప్రజ్ఞ



విశాఖ స్పోర్ట్స్: జిల్లా బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక పోటీల్లో మెన్ విభాగంలో కోమల్, వుమెన్ విభాగంలో ప్రజ్ఞ విజేతలుగా నిలిచారు. అండర్–11 సింగిల్స్ బాలురలో రిత్విక్, డబుల్స్‌లో రిత్విక్ రెడ్డి–మోజెస్ జోడి, బాలికల సింగిల్స్‌లో కె.రోషిణి, డబుల్స్‌లో క్రిష్టిన్–ఎవాంక జోడి విజయం సాధించింది. అండర్–13 సింగిల్స్ బాలురలో చద్విక్, బాలికల్లో వేదిక, అండర్–15 సింగిల్స్ బాలురలో రాహుల్, బాలికల్లో జిత్యా, అండర్–17 సింగిల్స్ బాలురలో బాలప్రణయ్, బాలికల్లో వైష్ణవి, అండర్–19 సింగిల్స్ బాలురలో నందివర్ధన్, బాలికల్లో వైష్ణవి విజేతలుగా నిలిచారు. జిల్లా బ్యాడ్మింటన్ సంఘం ఆధ్వర్యంలో బుధవారంతో ఈ పోటీలు ముగిశాయి. విజేతలుగా నిలిచిన వారు జిల్లా జట్టుకు ఆడనుండగా రన్నరప్ స్టాండ్‌బైగా నిలవనున్నారు. అండర్–15 ఏపీ స్టేట్ అంతర్ జిల్లాల బ్యాడ్మింటన్ పోటీలు విశాఖ వేదికగానే జరగనున్నాయి.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.59,620
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.54,650
వెండి(కిలో):	రూ.70,000

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	రూ.120
స్కిన్	రూ.210
స్కిన్‌లెస్	రూ.220

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	350.00
విజయనగరం	354.00
శ్రీకాకుళం	354.00

ప్రాణం తీసిన ఆన్‌లైన్ బెట్టింగ్



కొమ్మిరెడ్డి శేఖర్ మృతదేహం

కొమ్మాది: ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసై, అప్పు తీర్చలేక ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. బీచ్‌రోడ్డు తిమ్మాపురంలోని బీఎంఆర్ హేచరీలో అసిస్టెంట్ టెక్నీషియన్‌గా కొమ్మిరెడ్డి శేఖర్(26) విధులు నిర్వహిస్తున్నాడు. ఖాళీ సమయంలో ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్‌లు చేస్తుంటాడు. క్రమంగా ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యసనంగా మారింది. దీంతో శేఖర్ తలకు మించి అప్పులపాలయ్యాడు. ఈ అప్పులు తీర్చలేక ఒత్తిడి గురై అదే హేచరీలో బుధవారం ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనది తూర్పుగోదావరి జిల్లా పత్తిపాడు మండలం ధర్మవరం గ్రామం. కొన్నాళ్ల కిందట బీఎంఆర్ హేచరీలో అసిస్టెంట్ టెక్నీషియన్‌గా చేరాడు. తన చావుకు ఆర్థిక ఇబ్బందులే కారణమని రాసిన సూసైడ్ నోటును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. భీమిలి ఎస్సై భరత్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉక్కు కార్యాలయంలో 18 నాగుపాము పిల్లలు



పట్టుకున్న పాము పిల్లలతో కిరణ్‌కుమార్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్‌లో 18 నాగుపాము పిల్లలు బయటపడ్డాయి. బుధవారం అడ్మిన్ బిల్డింగ్‌లోని విజిలెన్స్ విభాగం వద్ద ఒక పాము పిల్ల బయట పడింది. వెంటనే వారు టౌన్‌అడ్మిన్ విభాగానికి సమాచారం అందించగా, వారు స్నేక్ క్యాచర్ కిరణ్ కుమార్‌కు తెలిపారు. వెంటనే అడ్మిన్ బిల్డింగ్‌కు చేరుకున్న కిరణ్ ఒక పాము పిల్ల కోసం ప్రయత్నించగా అందులో నుంచి మొత్తం 18 పాము పిల్లలు బయట పడ్డాయి. నాలుగు రోజుల క్రితం అక్కడ తల్లి పామును కిరణ్ పట్టుకున్నారు. ఆ పాము పెట్టిన పిల్లలు ఇప్పుడు బయట పడ్డాయి. పాములను ఫారెస్ట్ అధికారి సూచనల మేరకు అడవిలో వదిలి పెడతానని కిరణ్ తెలిపారు.

నేడు మిజోరం గవర్నర్ రాక



సీతమ్మధార : మిజోరం గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు గురువారం నగరానికి రానున్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు ఢిల్లీ ఎయిర్ పోర్టు నుంచి బయలుదేరి.. సాయంత్రం 5 గంటలకు విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి దసపల్లా హిల్స్‌లోని తన నివాసానికి చేరుకుంటారు. 14 ,15 తేదీల్లో నగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. 17వ తేదీ సాయంత్రం 4.35 గంటలకు దసపల్లా హిల్స్‌లోని తన నివాసం నుంచి విశాఖ విమానాశ్రయానికి వెళ్తారు. సాయంత్రం 5.45 గంటలకు ఎయిర్ ఇండియా విమానంలో మిజోరం ఎయిర్ పోర్టుకు బయలుదేరుతారు.

అసభ్యకర సందేశాలు పంపుతున్న ఉపాధ్యాయుడి అరెస్ట్



ముద్దాయి పెయ్యల శ్రీను(ఫైల్)

కూర్మన్నపాలెం : నకిలీ ఫేస్‌బుక్ అకౌంట్ ద్వారా అసభ్యకర సందేశాలు పంపుతున్న ఓ ప్రైవేట్ స్కూలు ఉపాధ్యాయుడిని దువ్వాడ పోలీసులు అరెస్ట్ చేశారు. కేసుకు సంబంధించి దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. పెయ్యల శ్రీను(29) కూర్మన్నపాలెంలోని ఓ ప్రైవేట్ స్కూల్లో ఐదేళ్ల క్రితం ఉపాధ్యాయుడుగా పని చేశాడు. ఆ సమయంలో వడ్లపూడి ప్రాంతానికి చెందిన అమ్మాయి అదే స్కూల్‌లో 10వ తరగతి చదువుతుండేది. ఈ క్రమంలో పెయ్యల శ్రీను ప్రేమ పేరుతో అమ్మాయిని తరచూ వేధించేవాడు. 10వ తరగతి పూర్తయ్యాక ఈ విషయం తన తల్లిదండ్రులకు తెలియజేయగా.. ఆమెను చదువు నిమిత్తం హైదరాబాద్‌కు పంపించారు. కోపం పెంచుకున్న అతడు.. ఆమె పేరిట నకిలీ ఫేస్‌బుక్ అకౌంట్ క్రియేట్ చేసి అసభ్యకరమైన సందేశాలను పంపుతుండేవాడు. విషయం తెలుసుకున్న ఆమె గత నెల 13న పెయ్యల శ్రీనుపై దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి నుంచి గాలింపు చేపట్టిన దువ్వాడ పోలీసులకు బుధవారం గాజువాకలో శ్రీను చిక్కాడు. అతడిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.